## క్లుప్తంగా

### సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

**కోడూరు:** మండలంలోని నరసింహపురం గ్రామంలో శనివారం నూతన సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.9.90 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రహదారిని నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులను కూటమి నేతలు, గ్రామ ప్రముఖులు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు తెలిపారు. టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

### గోసాలకు దాణా సరఫరా

**మోపిదేవి:** స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలోని గోసాలకు పశుసంవర్ధకశాఖ నుంచి 11.4 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ (మిశ్రమ దాణా) సరఫరా చేసినట్లు మండల పశువైద్యాధికారి నందకిషోర్ తెలిపారు. ఈ దాణా కోసం దేవస్థానం అధికారులు నాలుగు రోజుల కిందట బుక్ చేసుకోగా శనివారం అందించామని చెప్పారు. వెటర్నరీ సిబ్బంది, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

### ఉపాధి గ్రామసభలు

**కృత్తివెన్ను:** ఉపాధి హామీ పథకం ద్వారా చేయదగిన పనులకు సంబంధించిన వివరాలను ఫైనల్ గ్రామసభల ద్వారా తీర్మానం చేస్తున్నామని ఏపీవో పసుపులేటి సైదేశ్వరరావు అన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలకు నిర్దేశిత షెడ్యూల్ విడుదల చేసి సభలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం మండలంలోని సీతనపల్లి, కొమాళ్లపూడి, చినగొల్లపాలెం, నిడమర్రు, పడతడిక పంచాయతీల్లో ఈ సభలు జరిగాయి. గతంలో చేసిన పనులే కాకుండా మరిన్ని కొత్త పనులను గుర్తించి అందరికీ పూర్తిస్థాయిలో పనుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లతో పాటు, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ నాగసురేష్, టీఏలు కిషోర్, కళ్యాణ్, ఎఫ్ఏలు, ఉపాధిహామీ కూలీలు, మేట్‌లు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఛాయాచిత్రం బహూకరణ



**చిలకలపూడి(మచిలీపట్నం):** కలెక్టర్ డీకే బాలాజీ ఛాయచిత్రాన్ని ఓ ఉపాధ్యాయుడు శనివారం కలెక్టర్‌కు బహూకరించారు. ఉంగుటూరు మండలంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న పులవర్తి ఎలీషా స్వయంగా తాను పెన్సిల్‌తో గీసిన బొమ్మను కలెక్టర్‌కు అందించారు. పరిపాలనా విధానం చూసి కలెక్టర్‌పై మరింత అభిమానాన్ని, గౌరవాన్ని పెంపొందించుకుని తాను ఈ చాయచిత్రాన్ని గీసినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ ఉన్నారు.

### రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రారంభం

**శ్రీకాకుళం(ఘంటసాల):** విద్యతో పాటు ఆరోగ్యానికి విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీకాకుళం పీహెచ్‌సీ వైద్యాధికారి హనుమంతురావు అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్డులను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. సర్పంచ్ రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జ్వాలా తోరణం



పెదకళ్లేపల్లి నాగేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహించిన జ్వాలా తోరణం



పెదప్రోలు అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సహస్ర దీపోత్సవం



కోడూరులోని నక్కవానిదారి గ్రామంలో శివలింగాకృతిలో కార్తికదీపాలు

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో జ్వాలా తోరణం శనివారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు బుద్ధు ప్రసాద్‌శర్మ బ్రహ్మత్వంలో స్వామి వారికి పూజలు చేసిన అనంతరం, ప్రత్యేక పల్లకిపై స్వామివారికి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. ఎండు గడ్డితో ఏర్పాటు చేసిన జ్వాలాతోరణాలు వెలిగించి హరహరా అంటూ వాటికింద నుంచి స్వామివారి పల్లకిని దాటించారు. పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానంలో సహస్ర దీపోత్సవం నిర్వహించారు. దీపారాధనలతో శివలింగాన్ని ఏర్పాటు చేశారు.

**కోడూరు:** మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు సహస్ర దీపాలంకరణ సేవను కనులపండువగా నిర్వహించారు. నందీశ్వరుడు, లింగాకారుడి ఆకారాల్లో దీపాలు వెలిగించారు. నక్కవానిదారిలోని శ్రీరామమందిరంలో దీపసేవలను కమనీయంగా జరిపారు. శివలింగాకారంలో దీపాలను వెలిగించి భక్తిభావం చాటారు. కోడూరు పార్వతి సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో కూడా కార్తిక దీపాలను భక్తులు పెద్దసంఖ్యలో వెలిగించారు.

**కృత్తివెన్ను:** మండలంలోని గాంధీనగరం, అడ్డపర్ర తదితర గ్రామాల్లో శనివారం కార్తిక వన సమారాధనలు జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద ఉసిరి చెట్టు నీడలో విందు ఏర్పాటుచేశారు. గాంధీనగరం, అడ్డపర్ర గ్రామాల్లో అయ్యప్ప స్వామి పడిపూజలు ఘనంగా జరిగాయి. భక్తులు భారీగా హాజరయ్యారు.

# ఘనంగా కళాంజలి స్కూల్ వార్షికోత్సవం



శంభోశంకర అంటూ డాన్స్ చేసిన విద్యార్థులు

**పెడన:** పట్టణంలోని మఠంవీధిలోని కళాంజలి హైస్కూల్‌లో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పెడన ఎస్ఐ–2 రాజేంద్రప్రసాద్, సివిల్ సర్జన్ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ బి. వెంకటేష్, సివిల్ ఇంజినీర్ సుబ్బారావు విచ్చేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి ముఖ్యఅతిథులు అభినందించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మండల ఫస్ట్‌గా నిలిచిన జోయా ముస్కాన్‌కు, ఆయేషా గుల్‌ఫామ్‌లకు మెమెంటోలను అందజేసి వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఎస్ఐ–2 రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటలు ఆడించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు వల్ల విద్యార్థులు మరింత ఉత్సాహవంతులుగా తయారవుతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాసవి క్షేత్రంలో అయ్యప్ప స్వామి మండలి పూజలు



అయ్యప్పస్వామికి అభిషేకానికి ద్రవ్యాలను తీసుకువచ్చిన కొల్లిపర వంశీయులు

**పెడన:** పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవి క్షేత్రంలోని శ్రీహరిహర పుత్ర అయ్యన్ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో అయ్యప్పస్వామి మండలి పూజలు శనివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొల్లిపర ప్రసాద్ శిరీష, కొల్లిపర శ్రీనివాసరావు అన్నపూర్ణ, కొల్లిపర పాండురంగారావు వనిత దంపతులచే శ్రీవాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు శ్రీఅయ్యప్ప స్వామి వారికి 21 రకముల ద్రవ్యములతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు, భవానిలకు కొల్లిపర వంశీయులు ఏర్పాటుచేసిన సద్ది (అన్న సమారాధన) కార్యక్రమంలో తీర్థప్రసాదాలను స్వీకరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లిపర సత్యనారాయణ (చిన్నా) పర్యవేక్షణలో పట్టణ శ్రీవాసవి మహిళా మండలి వారు తమ సేవలు అందించారు. సంఘ నాయకులు, కొల్లిపర వంశీయులు పెద్ద ఎత్తున ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# మానవత్వ వికాసం పరిపూర్ణం కావాలి



ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ కెరోలిన్, నిర్వాహకురాలు ప్రభుకుమారి

**నాగాయలంక:** స్థానిక షెకీనా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఇమ్మడి సుబ్బయ్య ఫంక్షన్ హాల్లో గత వారం రోజులుగా జరుగుతున్న ఆశీర్వాద ఉజ్జీవ పండుగలు శనివారం ముగిశాయి. చెన్నైకు చెందిన బ్లెస్సింగ్‌వే మినిస్ట్రీస్ డాక్టర్ కెరోలిన్ సందీపా ముగింపు సభలో ప్రధాన వక్తగా పాల్గొన్నారు. పూషడపు ప్రభుకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ దైవత్వంతో మానవత్వ వికాసం పరిపూర్ణం కావాలని చెప్పారు. అప్పుడే సామాజిక అభ్యున్నతి పెంపొందగలదని పేర్కొన్నారు. ప్రశాంత్ జోష్ (బెంగళూరు), రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లు, దైవసేవకులు పాల్గొన్నారు. దైవజనులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## నేటి బాలలే రేపటి పౌరులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోపి సత్యనారాయణ

**కోనేరుసెంటర్:** నేటి బాలలే రేపటి పౌరులని మచిలీపట్నం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని కానూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు క్రై స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. సంస్కారంతో కూడిన విద్య సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకు వెళుతుందన్నారు.

# గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం



కోడూరులో గ్రంథాలయ ఉద్యమ నేతలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



అర్తమూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పెడన శాఖ గ్రంథాలయంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రావివారిపాలెం గ్రంథాలయంలో మాట్లాడుతున్న కుటుంబరావు

**పెడన:** విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలని, ఎవరు గెలిచినా, ఓడినా దానిని స్పోర్టివ్‌గా తీసుకునే మనస్సు కలిగి ఉండాలని పెడన శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల మల్లికార్జున ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజు శనివారం విద్యార్థులకు సైన్సు, పజిల్ పోటీలు నిర్వహించారు. శాఖ గ్రంథాలయాధికారి బసవేశ్వరరావు పాల్గొన్నారు.

**రావివారిపాలెం(మోపిదేవి):** ఉద్యమకారుల కృషి ఫలితంగానే గ్రంథాలయాలు స్థాపించబడ్డాయని మోపిదేవి జెడ్పీ పాఠశాల విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు తెలిపారు. మండలంలోని రావివారిపాలెం గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

**బంటుమిల్లి:** మండల పరిధిలోని అర్తమూరు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అర్తమూరు, ముంజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకురాలు దుర్గ పర్యవేక్షించారు.

**కోడూరు:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పోరాడిన దివంగత అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం జీవిత చరిత్రను గ్రంథాలయ అధికారిణి పుష్పలత వివరించారు.

**అవనిగడ్డ:** గ్రంథాలయ వారోత్సవాలు మూడోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, వెంకట రమణయ్య, తదితరులను స్మరించుకుంటూ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అన్నపురెడ్డి పిచ్చియ్య, ఎస్‌బీఐ అధికారి రాజుల పాటి ప్రసాద్, సింహాద్రి రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**కొడాలి(ఘంటసాల):** కొడాలి, ఘంటసాల గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మాస్టారు జె.శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిలో కార్తిక వన మహోత్సవం



రాతి ఉసిరి చెట్టు కింద పూజలు చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

**పెడన:** మండల పరిధిలోని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో కార్తికమాస విశిష్టతను పురస్కరించుకొని శనివారం కార్తిక వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్తిక దీపోత్సవం ఏర్పాటు చేశారు. తొలుత కళాశాలలోని రాతి ఉసిరి చెట్టు వద్ద పార్వతీ పరమేశ్వరులకు విశేష పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త డాక్టర్ పి.అనంతలక్ష్మి కార్తికమాస విశిష్టతను తెలియజేశారు. భక్తి గీతాలకు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కరెస్పాండెంట్ కె. కుమార్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, డిప్లొమా ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్, కోఆర్డినేటర్ ఎస్. అనిల్‌కుమార్, ఆయా విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులకు మరో రూ.5.17 కోట్లు

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

**అవనిగడ్డ:** నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు మరో రూ.5.17 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. అవనిగడ్డలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రధాన రహదారులను గుంతల రహితంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గానికి రెండో విడత నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రకటన

[illegible]

### నాణ్యమైన విద్యా బోధన అందిస్తాం



**మచిలీపట్నంటౌన్:** పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ ఆసిఫ్ హుస్సేన్ తెలిపారు. విద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు స్పీచ్ థెరఫీ, బిహేవియరల్ థెరఫీలను అందించి సాధారణ తరగతి గదిలో సమ్మిళిత విద్యలో ముదుకు సాగేలా చూస్తున్నామన్నారు. వీరికోసం ప్రత్యేక ఉపాధ్యాయుడిని నియమించి తర్ఫీదు ఇస్తున్నామన్నారు.

### దీక్షాపరుల సద్ది సమారాధన శిబిరాలు ప్రారంభం



**బంటుమిల్లి:** మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన దీక్షాపరుల కోసం శనివారం అన్నసమారాధన (సద్ది) శిబిరాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక అయ్యప్పస్వామి గుడి వద్ద దేవస్థానం కమిటీ, స్థానిక రామాలయం వద్ద అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు దాదాపు 54 రోజులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు అయ్యప్ప, శివ, భవానీ దీక్షాపరుల ఆధ్వర్యంలో స్వామివార్ల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సద్ది తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు ఈ. లీలాకృష్ణ, ఎం. నాగబాబు, రాంబాబు, అయ్యప్ప గురుస్వామి కె. రాంబాబు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి

**యండకుదురు(ఘంటసాల):** 104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యండకుదురు ఎంపీటీసీ కుమార్ రాజాకు సిబ్బంది శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో జీతాలు చెల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలని ప్రజాధనం వృథా కాకుండా చూడాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. డ్రైవర్ ఎ.శ్రీనివాసరావు, డీఈఓ డి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**అవనిగడ్డ:** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది అవనిగడ్డ సర్పంచ్ గౌరుముచ్చు ఉమకు వినతిపత్రం సమర్పించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104 సర్వీసులు అందించాలని, ప్రతి నెలా వేతనాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. డీఈఓ పి.స్వాతి, జి.నాంచారయ్య ఉన్నారు.

### మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పద్మావతి

**గూడూరు:** మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మేరుగు పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య పాలకవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా గూడూరుకు చెందిన పద్మావతి, ఉపాధ్యక్షురాలిగా పెరుమాళ్లి వనజ (పోసినవారిపాలెం) కార్యదర్శిగా మారిశెట్టి లక్ష్మి (మల్లవోలు శివారు కుమ్మరిపాలెం), సంయుక్త కార్యదర్శిగా తాటాకుల వనజ (కంకటావ), కోశాధికారిగా మట్టా వెంకటేశ్వరమ్మ (ఆర్.వి.పల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం వై.రాజగోవింద్, సీసీలు ఆరేపు శ్రీనివాస్, ఇంకొల్లు లక్ష్మీతులసి వారిని అభినందించారు.